

సత్యం మందపాటి

"ఈ సముద్రపు ఒడ్డున ఇలా కూర్చుని, పైనవున్న ఆకాశాన్నీ, క్రిందవున్న సముద్రాన్నీ చూస్తే నాకో విషయం గుర్తు కొస్తున్నది" అన్నాడు రాజు, అప్పటి దాకా అలుముకున్న మౌనాన్ని భంగ పరుస్తూ.

"బోరు కొట్టక త్వరగాచెప్పు-మాలతీ వాళ్ళు వచ్చే ప్రైమవుతున్నది" అన్నాడు రాధాకృష్ణ.

"ఇవాళ వీడికథ వినక తప్పదు కాబోలు" సణుగుతున్నాడు మూర్తి.

"రెండేళ్ళక్రితం జరిగినదీ కథ. మా మామయ్య బాగా డబ్బున్నవాడు. ఆ వూరిలో చాల పెద్దవాడుగా పేరుపొందిన వాడు. మా మామయ్య కూతురు రేఖను చూసొద్దామని, ఒకరోజు మామయ్యా

వాళ్ళింటికి వెళ్ళాను. అక్కడ అంతా గందరగోళంగావుంది. మామయ్య అరుస్తున్నాడు. 'అంత అజాగ్రత్త అయితే ఎలా అని-' రేఖా, అత్తయ్య మాట్లాడకుండా తలవంచుకు నుంచున్నారు. అత్తయ్య వెనకాలే, ఆవిడ కాళ్ళను పెనవేసుకుని, భయం భయంగా చూస్తున్నాడు బాబీ-మామయ్య ఆఖరి కొడుకు. మూడేళ్ళ వాడు.

నన్ను చూడగానే మామయ్య "చూశావురా-మనవాళ్లు ఎంత జాగ్రత్తగలవాళ్లో!" కోపంగా అని, ఒకక్షణం ఆగి "నే పోయాక ఎలా బ్రతుకుతారో వీళ్ళు!" అన్నాడు అదోరకంగా.

ఆయన మాటలకు నవ్వబోయి, పెద్ద వాడు బాగుండదని ఊరుకున్నాను.

"నువ్వుకూడా ఒకసారి ఇల్లంతా వెతకరా రాజూ-దొరుకుతుందేమో" అన్నది అత్తయ్యనాతో.

"అసలింతకీ ఏం పోయినట్టు .. "

"నేను చెబుతానుండరా - మొన్న సాయంత్రం బాబీ పుట్టినరోజు పండగ అయింది కదా. పేరంటం, పార్టీ అంతా అయాక-వాడిమెళ్ళో పెట్టిన బంగారపు గొలుసు తీసివేయటం మరచిపోయింది మీ అత్తయ్య. అసలు ఆ హడావిడిలో, నిన్నటిదాకా ఆ గొలుసు సంగతే గుర్తుకు రాలేదు. ఇవాళ హఠాత్తుగా గుర్తొచ్చి చూసుకుంటే వాడి ఒంటిమీదా లేదు. ఇంట్లోనూ లేదు. ఏమవుతుంది మరి?" అన్నాడు మామయ్య.

"వాడినే అడిగితేపోలా-ఏరా బాబీ, నీ మెళ్ళో గొలుసు ఎక్కడ పెట్టావురా-అమ్మడూ" లాలింపుగా అడిగాను వాడ్ని.

వాడు నన్నొక క్షణం దీనంగా చూసి, భోరుమని ఏడ్చేశాడు.

వాడి తలమీద చేయివేసి నిమురుతూ "ఏడుస్తా వెందుకురా నాగన్నా. నిన్నేమీ అనునులే చెప్పు గొలుసు ఎవరికిచ్చావూ" అడిగాను మళ్ళీ.

వాడు జవాబు చెప్పకుండా, కారుతున్న ముక్కుని, చొక్కాతో తుడుచుకున్నాడు.

"వాడి మొఖం-వాడికేం తెలుసు కుర్ర వెధవ-పెద్దవాళ్లకే జాగ్రత్తలేనప్పుడు...." మామయ్య చిర్రు బుర్రు లాడుతున్నాడు.

"నువ్వు ఇంట్లో ఒకసారి చూడు రాజూ...." అత్తయ్య మళ్ళీ అన్నది.


"ఇప్పటికి పాతికసార్లు చూశాం. యింకేం వుంటుంది."

అయినా-రేఖను ఆ వంకతో ప్రక్కనే వుంచుకుని-ఇల్లంతా వెతికాను.

నేను వెతుకుతున్నప్పుడు మామయ్య అన్నాడు. "ఆ గొలుసు మామూలు గొలుసుకాదు-దాని లాకెట్‌లో మంచి రత్నం వుంది-గొలుసు అంటే ఏ నాలు గైదు వందలలో అనుకుంటున్నావు కాబోలు. దాని ఖరీదు మూడువేల రూపాయలు. దగ్గరుండి మద్రాస్ ఉమ్మిడియార్స్‌లో చేయించాను. రేపు పదో తారీకుకి అది చేయించి నెల అవుతుంది. జాగ్రత్తలేని మనుషులకు అలాటి ఖరీదయినవి కొనివ్వటం నాదే తప్పు" సణుగుతున్నాడు మామయ్య.

ఇంట్లో ప్రతిమూల వెతికినా ఆ గొలుసు కనపడలేదు.

"నిన్న బాబీగాడు, ఇంట్లోనించి బయ




టకు ఎప్పుడైనా వెళ్ళాడా" అని అడిగాను రేఖను.


తన పెద్ద పెద్ద కళ్ళను ఒకసారి పైకెత్తి, చటుక్కున క్రిందకు వాల్చి, 'ఉహూ' అన్నది.

ప్రక్కన మామయ్య వున్నాడు కానీ, లేకపోతే ఆమె అందాలనుంచి రాలిన ముత్యాల్ని ఏరి, బాబీగాడి కింకో లాకెట్ చేయించి వుండేవాడిని.

కథ వింటున్న మూర్తి అడ్డు తగిలాడు. "ఒరే రాజా - గొలుసు కథ చెబుతూ ప్రేమ కథలోకి వెళ్ళకు-నీతో వచ్చిన చిక్కే యిది" అన్నాడు రాజుని విసుక్కుంటూ.

రాజు అదోలా నవ్వి "ఇది ప్రేమకథ కాదు మూర్తి. డబ్బుల్లో తేలిపోతున్న మామయ్యలాటి వాళ్ళ జీవితాల్లో ప్రేమల్లాంటివి వుండవ్. మామయ్య నన్ను కూర్చోపెట్టి అన్నీ వివరంగా చెప్పాడు. బాబీకి ఆరోజు రాత్రి ఒళ్ళు వెచ్చబడిందిట. అందుకని వాడ్ని బయటకు ఎక్కడికీ పంపించలేదన్నాడు. ఇంట్లో మామయ్య, అత్తయ్య, రేఖా, బాబీ మాత్రమే వున్నారు. మరింక ఎవరు తీస్తారు-ఇలా చెబుతున్న మామయ్య ఒక క్షణం ఆగాడు. ఏదో ఆలోచన వచ్చింది మా అత్తయ్యని అడిగాడు 'పనమ్మాయీ-పాలవాడూ-చాకలివాడూ నిన్న మనింటికి వచ్చారా' అని.

"పాలవాడు ప్రొద్దున్నే అయిదింటికే వచ్చాడు-వాడు తలుపు కొట్టాక నేనే వెళ్ళి తలుపుతీశాను. పాలు పోయగానే వాడు వెళ్ళిపోయాడు. నేను మళ్ళీ తలుపు వేసేశాను" అన్నది అత్తయ్య.




"మళ్ళీ సాయంత్రం ఎన్నింటికి వచ్చాడు" అడిగాను.

"రాలేదు!" అన్నది అత్తయ్య.

"అయితే వాడే తీసుంటాడు - ఆ చింపిరి ముఖం వాడూనూ - వాడ్ని చూస్తేనే తెలుస్తుంది వాడలాటి బుద్ధి వాడని " మామయ్యకి అపరాధి దొరికి పోయాడు.

"లేదు-టీపార్టీకోసం తెప్పించిన పాలు చాల మిగలటంతో నేనే వాడిని సాయంత్రం పాలు తేవద్దని చెప్పాను. అందుకే వాడు రాలేదు!" అన్నది అత్తయ్య-కోర్టులో నిజంగా నిజం చెబుతున్న నిజమైన సాక్షిలా.

"ఏడవలేకపోయావ్!" అన్నాడు మామయ్య.

'పనిమనిషి?" అడిగాను నేను.

"అది చాల నమ్మకస్తురాలు-ఏనిమిదేళ్ళనుంచీ మనింట్లో పనిచేస్తున్నది. మొన్నీ మధ్య ఇల్లు ఊడుస్తుండగా మంచంక్రింద రేఖ బంగారపు గాజులు కనపడితే. తీసి జాగ్రత్తగా అప్పచెప్పింది. ఆ బుద్ధుంటే అది ఆ గాజులు ఆ రోజే మాయం చేసివుండేది!"

"ఇలా అందర్నీ నమ్ముతావ్ కాబట్టే. ఇవాళ ఈ గొలుసు పోయింది. ఒక జాగ్రత్తలేదూ పాడూలేదు!"

"పనమ్మాయి ఇంట్లో వున్నంతసేపు. దాన్ని కాపలా కాయటంకోసం కాకపోయినా, ఏదో పనిమీద ఇటూ అటూ తిరుగుతూనే వున్నాం. అయినా అది వున్నది ప్రొద్దునో రెండు గంటలు. సాయంత్రం ఒకగంట-అది తీస్తుందని నేను అనుకోను!"

"చాకలతను ఎప్పుడు వచ్చాడు!"

"వాడు ప్రొద్దున ఎనిమిది గంటలకు వచ్చాడు. బట్టలు తీసుకుని వెంటనే వెళ్లిపోయాడు. వాడు సరిగ్గా పది నిముషాలు వున్నాడేమో ఇక్కడ. రేఖే వాడికి బట్టలువేసి పద్దురాసింది-తన చీర ఏదో అర్జంటుగా కావాలి రేపే తెమ్మని చెప్పింది కూడాను-వాడికి తీసే అవకాశం వుందని నేననుకోను!" అన్నది అత్తయ్య.

"ఏం రేఖా!" అడిగాను మృదువుగా.

పెద్ద కళ్ళను మరింత పెద్దవిచేసి, నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ, తల ఆడించింది-తర్వాత నాకన్నా, నేల అందంగా వుందనుకుందేమో, నేల చూపులు చూపింది—

"ఏనమ్మాయో, చాకలాడో తీసుంటారు. అలగా జాతి వెధవలు-వాళ్ళ బుద్ధులే అంత" తిడుతున్నాడు మామయ్య.

"వాళ్ళకి తీసే అవకాశాలు లేవంటున్నారు కదా అత్తయ్యా వాళ్ళు" అన్నాను.

"నీ మొఖం. వాళ్ళ ముఖమూనూ-ఈ అజాగ్రత్త మనుషుల కళ్లు కప్పటం ఒక విద్యా-కన్నుమూసి తెరిచేంతలో వస్తువులు మాయం చేస్తారు దొంగ వెధవలు....అలగా ముం...." మామయ్య నోటికి అడ్డులేకుండా తిడుతున్నాడు.

"చితకదన్ని పోలీసుల కప్పచెప్పాలీలం...." మా మామయ్య వాక్ప్రవాహానికి అడ్డంవేస్తూ అన్నాను.

"ఇంకా ఎవరెవరు వచ్చారు మనింటికి."

"ఇంకెవరూ రాలేదు!" అన్నది అత్తయ్య.

"ఏం రేఖా.."

"మా ఫ్రెండ్ సుజాత వచ్చింది—బోటనీ రికార్డు పూర్తిచేసుకుని ఒక గంటలో వెళ్లిపోయింది!"

"అది సరేలే, సుజాతకేం అవసరం గొలుసు తీయడానికి-వాళ్ళ నాన్న ఎం. ఎల్. ఏ-ఇలాటి గొలుసులు లక్ష కొనివ్వగలడు" అన్నాడు మామయ్య.

ఇంతలో చాకలివాడు వచ్చాడు.

"అమ్మగారూ—ఇదుగోనమ్మా మీరు వేగిరం తెమ్మన్న చీర" అంటూ చక్కగా యిస్త్రీ చేసిన చీర అందించాడు రేఖకి.

"ఏరా అప్పన్నా—యిస్త్రీ చాక్కా వేశావ్—ఏమిటి విశేషం." వ్యంగ్యంగా అడిగాడు మామయ్య.


వాడు సిగ్గుపోయాడు "ఇయ్యాల్టికి నా అడదాన్ని పెళ్ళాడి రెండేళ్ళవుతాదయ్యా!" అన్నాడు తల ఎత్తకుండానే.

"అంతేనా, ఎక్కడయినా డబ్బులు కలిసొచ్చాయా!" అన్నాడు మామయ్య.

[చాకలతను యిస్త్రీ బట్టలు వేసుకుంటే, అదీ వాడి జీవితంలో ఒక ముఖ్యమైన రోజు, వాడికి డబ్బులు కలిసి వచ్చినట్టు!]

వాడికి మామయ్య మాటలు సరిగ్గా అర్థమైనట్టు లేదు. "మాకు డబ్బులేడ కలిసొస్తాయయ్యా — మీలాంటి ధరమ రాజులు [చాకిరీ చేయించుకుని డబ్బులిచ్చే వాడి పేరు ధర్మరాజు!] యిచ్చే పావల్డబ్బుల్తో మేం గంజినీళ్ళు తాగాల" అన్నాడు వాడు.

"పావలా డబ్బులేమిట్రా — మూడు వేల రూపాయలు వస్తాయి ఆ గొలుసు




"అమ్మితే!" లూప్‌లైన్‌లోంచి మైన్‌లైన్‌లోకి వచ్చాడు మామయ్య.

"ఏ గొలుసు బాబూ!" అన్నాడు అప్పన్న కొంచెం అర్థంకాక, కొంచెం కంగారుగానూ, కొంచెం ఆశ్చర్యంగానూ.

"ఎందుకురా గొలుసు మాట ఎత్తితే అంత కంగారు పడతావ్—పోలీసు రిపోర్టు యివ్వనులే-ఆ గొలుసు యిచ్చేయి-నిన్ను క్షమించి వదిలేస్తాను."

వాడు ఈ సారి వణకటంకూడా ప్రారంభించాడు.

"ఏ గొలుసు బాబూ నాకేం తెలీదు బాబూ...." అంటున్నాడు వాడు.

రేఖ అమాయకంగా అన్నది "అయ్యగారు మద్రాసు నుంచి బాబీకి తెచ్చారని ఆ రోజు నీకు చూపించలా ఆ గొలుసు అప్పన్నా—కనపడటం లేదు."


"ఇంకేం—ఆ గొలుసు వీడికి ముందే చూపించావన్న మాట—వీడి కన్ను దాని మీద పడింది—అప్పన్నా ఆ గొలుసు యిచ్చేస్తే నిన్ను పోలీసులకు పట్టివ్వను యిచ్చేయి-లేదా తర్వాత చాలా హైరాన పడవలసి వస్తుంది!"

వాడు వెంటనే మామయ్య కాళ్ళమీద పడ్డాడు.

[తరువాత హైరాన పడటంకన్నా. ముందే పెద్దవాళ్ళ కాళ్ళమీద పడటం మేలు!]

"నేను అలాంటి వాడినికాదు బాబూ, నాకేటీ తెలీదు—దొంగతనం మాయింటా వంటా లేదు—నన్ను నమ్మండి బాబూ!"

మామయ్యలోఅప్పటిదాకావున్నకోపం




ఒక్కసారిగా కాళ్ళద్వారా బయటికి వచ్చి, వాడ్ని బలంగా తన్నింది. వాడు వెల్లికిలా పడ్డాడు.

"రాస్కెల్ — ముందు ఆ గొలుసు తెచ్చి యిచ్చేయి-మీ వంశాల సంగతీ, దొంగ బుద్ధుల సంగతి నాకు బాగా తెలుసు- ఆ గొలుసు మూడువేల రూపాయలదిరా, మామూలుది కాదు!" వాడి చొక్కా పట్టుకుని పైకిలేపి, ఆ దవడా - ఈ దవడా వాయించాడు.

నేను ఆ అమానుషాన్ని భరించలేక, మామయ్య చేతులు పట్టుకుని ఆపాను.

"వదల్రా రాజూ — ఈ దొంగ వెధవలకు నాలుగు తగిలిస్తే కానీ నిజం చెప్పరు. అసలు వాళ్ళకు ఎంత కొట్టినా దెబ్బలు తగలవ్-మన చేతులు నొప్పి పుట్టాలి కానీ — బండ వెధవలు" మళ్ళీ కొట్టబోయిన మామయ్యను వారించాను.

"ఉండు మామయ్యా-వాడు తీశాడని ఏమిటి, తియ్యలేదని వాడు చెబుతున్నాడు కదా!"

అంత కోపంలోనూ నవ్వాడు మామయ్య "దొంగతనం చేసినవాడు చేశానని చెబుతాడటరా రాజూ, నీ పిచ్చి కానీ .. వీడే తీశాడు — నాకు తెలుసు" అంటూ గబగబా వెళ్ళి నేను తేరుకునే లోపలే, పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేశాడు కూడాను.

అప్పన్న అమ్మగారితో చెప్పుకుని, ఏడుస్తున్నాడు.

[ఎప్పుడూ 'త్రూ పాపర్ ఛానల్'లో పోవలయును.]

ఓడిపోయిన మంత్రిలా అమ్మగారికి ఆ యింట్లో పవర్స్ లేనందున, ఆవిడ కనీసం సానుభూతికూడా చూపించలేకపోయింది.

అప్పన్న దగ్గరకు వెళ్ళి, వాడి కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగాను —

"అప్పన్నా! నిజంగా నువ్వు తీశావా?"

వాడు ఈసారి నా కాళ్ళమీద పడి భోరుమన్నాడు-చెప్పటం ఆపి పైన వున్న ఆకాశంకేసి చూస్తున్నాడు రాజు.

ఒక క్షణం ఆగి, ఏదో చెప్పబోయి, మళ్ళీ ఆగిపోయాడు రాజు.

"చెప్పు!" అన్నాడు మూర్తి.

"మాలతి వచ్చేలోగా పూర్తిచేయాలి-త్వరగా చెప్పు" అన్నాడు రాధాకృష్ణ.

"ఏం చెప్పను? నా మాట వినకుండా మా మామయ్య అప్పన్నని పోలీసులకు అప్పచెప్పాడు. పోలీస్‌స్టేషన్‌లో వాడ్ని చితకతన్నారు. వాడి శరీరం చట్నీ అయింది.అయినా వాడు తీయలేదన్నాడు. ఒక పదిరోజులు వాడిని హింసించి,వాడిని కొట్టటానికి పోలీసుల్లో యిక శక్తి లేక పోవటంవల్ల వాడిని వదిలేశారు—అంతే కాదు ఎనిమిదేళ్ళుగా నమ్మకంగా పని చేస్తున్న పని అమ్మాయిని కూడా మాన్పించేశారు—తర్వాత కొన్నాళ్ళకు ఈ కథకు అనుకోని విధంగా ముగింపు జరిగింది—మీరు చెప్పగలరా ఆ ముగింపుని?" అడిగాడు రాజు.

నారాయణ అన్నాడు "నేను చెబుతాను-ఒకరోజు మీ మామయ్య ఇంటికి వచ్చేసరికి, బాబీ మంచంమీద కూర్చుని అదే గొలుసుతో ఆడుకుంటున్నాడు—మీ మామయ్య ఆశ్చర్యపడ్డాడు. 'గొలుసు దొరికింది' అని గావుకేకపెట్టాడు. మీ అత్తయ్య. నీ స్వప్నసుందరికూడా పరుగెత్తుకుంటూ వచ్చి, ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ ప్రకటించారు. మెల్లగా లాలించి బాబీని అడిగారు—"ఓంటమ్మా ఈ గొలుసు వొక్కల నించీ వచ్చిందీ—" అని.

బాబీ నవ్వాడు. ప్రక్కనే వున్న గోడలోని కంతను చూపించాడు. మీ మామయ్య దాంట్లో వేలు పెట్టబోతే, ఆ కంతలోవున్న ఎలుక నవ్వి 'నా బంగారు కొంపలో వేలుపెడితే కరుస్తా' అన్నది. అదీ కథ."

నారాయణ తన ముగింపును ముగించాడు. అన్నట్టు నారాయణే వాళ్ళవిద వ్రాసిన కథలను పెయిర్‌చేస్తూ వుంటాడు.

రాధాకృష్ణ నవ్వాడు. ఇలాటి కథ మాలతికి చెప్పి ఆమెను నవ్వించాలనుకున్నాడు మనసులో.

"ఇది అలాటి కథకాదు నారాయణా-ముగింపు యింకోలా జరిగింది" అన్నాడు రాజు.

"నేను చెబుతాను ఎలా జరిగిందో!" అన్నాడు రాధాకృష్ణ.

"ఒకరోజు నీ స్వప్నసుందరి నగలు కొందామని సేట్ చమన్‌లాల్-చుమన్‌లాల్ షాపుకు వెళ్ళింది. అక్కడ మొట్టమొదటగా ఆమెనుఆకర్షించినది లాకెట్‌లో మంచిరత్నంవున్న ఆ గొలుసు.చూడగానే అదిరిపడింది. ఆ విషయం నీకు మేఘసందేశంద్వారా తెలిపింది. ఆ మెసేజ్ అందుకుని నువ్వు అక్కడ వాలావ్. చమన్‌లాల్‌నీ, చుమన్‌లాల్‌నీ దబాయించి అడిగావ్. ఫలానా అప్పారావ్ ఆ నగని తాకట్టుపెట్టి డబ్బు తీసుకుపోయినట్టు చెప్పాడు-ఫలానా అప్పారావ్ కాలర్ పట్టుకుని, భూమికి బారెడు ఎత్తున

పైకెత్తి, 'ఏరా నీకు యిదెక్కడిద'ని అడిగావ్—వాడు. వాడికి వాడి డ్రీమ్‌గాల్ ఇచ్చిందని చెప్పాడు. ఫలానా అప్పారావ్ గాడి డ్రీమ్‌గాల్ పేరు సుజాత. వాళ్ళ నాన్న ఎం. ఎల్. ఏ. ఆ డ్రీమ్‌గాల్ నీ స్వప్నసుందరికి ఫ్రెండ్. ఆరోజు బోటనీ రికార్డు వ్రాయటం పూర్తయిన తర్వాత, 'యాస్పరాగస్' బొమ్మ గీసిన పేజీలో గొలుసును దాచేసి యింటికి వెళ్ళి పోయింది. ఎం. ఎల్. ఏ. డాటరు కిదేం ఖర్మ అని కదూ మీ అనుమానం. మరేం లేదు. ఆ అమ్మాయి అప్పారావ్ అనే అర్భకుడ్నీ, అనామకుడ్నీ(?) ప్రేమించింది కదా. వాళ్ళ నాన్నేమో, ఆ అమ్మాయిని కోప్పడి, ఆ అమ్మాయి రాకపోకల మీదా, ఖర్చుల మీదా, చాల ఆంక్షలు విధించి, ఆ యింట్లో 'అత్యవసర పరిస్థితి'ని ప్రకటించాడు. అందుకని ఆ పిల్ల ఈ పని చేసింది. ఆ నగని అప్పారావ్ సేట్ వ. లాల్-చు. లాల్‌దగ్గిర తాకట్టు పెట్టి డబ్బుతీసుకున్నాడు. ఆ డబ్బుతో ఇద్దరూ ఎక్కడికయినా పారిపోవాలని ఆ సుజాత అనబడే యువతిలాగా వుండాలని అభిలషించే యువతి ఊహ. కాని అప్పారావ్ వుద్దేశ్యం పేరు లక్షల్లో ఓట్లనే ఏరుకున్న ఎం. ఎల్. ఏ వాళ్ళమ్మాయితో పారిపోయే అప్పారావ్‌ని బయటకులాగి, సులభంగా నలిపేయగలడు. ఎందుకొచ్చిన తద్దినం అనుకుని అప్పారావ్, ఆ డబ్బులన్నీ తినేసి బ్రేవ్‌మని త్రేన్చేశాడు. అదీ కధ" తన ముగింపునికూడా చెప్పాడు రాధాకృష్ణ.


"ముగింపు బాగానే వుందికానీ, నిజంగా యిలా జరగలేదు." అన్నాడు రాజు.

"మరెలా జరిగింది?"నారాయణ కుతూహలం.

"నాలుగు నెలలు జరిగిపోయాయి. ఎండాకాలం వచ్చేసింది. ఎండలకు బండలు కరిగిపోతున్నాయి. అలాటి రోజుల్లో ఒకరోజు మధ్యాహ్నం మామయ్యవాళ్ళ యింటితలుపు తట్టారు ఎవరో. కడుపునిండా తిని, కంటినిండా నిద్రపోతున్న మామయ్య విసుక్కొంటూ లేచి తలుపు తెరిచాడు. ఎదురుగా చెమటలు కక్కుకుంటూ నుంచుని వున్నాడు చాకలి అప్పన్న.

మామయ్యకి వాడినీ, వాడి చేతిలోని గొలుసునీ చూడగానే నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది.

"ఏరా—దొంగవెధవా, ఇన్నాళ్ళకి తెచ్చి యిస్తున్నావా గొలుసుని ...వెధవన్నర ...వెధవా ..." అంటూనే గొలుసుని వాడి చేతిలోనుంచి లాక్కుని, దానికి అంటుకున్న మట్టిని పైపంచెతో తుడిచి, తృప్తిపడ్డాడు మామయ్య గొలుసునిచూసి తృప్తిపడ్డాడేకానీ, అప్పన్న దాన్ని యిచ్చినందుకు హర్షించకపోగా, వాడ్ని పోలీసులకు పట్టిస్తానని బెదిరించాడు. నింపాదిగా అడిగినమీదట తెలిసిన విషయం, యింకా ఆశ్చర్యంలో ముంచివేసింది. మా వూరి చెరువులో ఎండమూలంగా నీళ్ళు ఎండిపోయి—వీడు ఎప్పుడూ తను బట్టలు వుతికే బండదగ్గర, నీళ్ళకోసం పెద్ద గుంట తవ్వుతున్నాడు. తవ్వుతుంటే హరప్పా, మొహెంజొదారోల్లో నిక్షేపాల్లా




బయటపడిందీ నగ. ఆరోజు రాత్రి, బాబీ గొలుసు- నిద్రలో మెడకు గుచ్చుకుంటు న్నందువల్ల, తీసి తన చొక్కా-జేబులో వేసుకున్నాడు. బాబీని అడిగితే గుర్తుతెచ్చు కుని అవునన్నాడు. ప్రొద్దునే చాకలిరాగానే వాడి చొక్కా-విప్పి హడావుడిగా చాకలికి వేశారు. అది వాడూ చూసుకోలేదు. రేవులో బట్టలు వుతికే సమయంలో అది జారి నీటిపాలయింది. గంగాదేవి తన గర్భంలో జాగ్రత్తగా దాన్ని దాచుకుంది. ఎండలకారణంగా, గంగాదేవి ఎండిపోతూ ఆ నగని భూదేవి గర్భంలో దాచి, మరీ ఎండిపోయింది—అప్పన్న అదృష్టం బాగుండి, వాడు గుంటలో తవ్వగా అది బయటపడింది. ఇది నమ్మనంత నిజంగా లేకపోయినా, ఇదే జరిగింది" ముగించాడు రాజు.

"మీ మామయ్య వాడి మాటలు నమ్మక, మళ్ళీ పోలీసులకు అప్పచెప్పి వుంటాడు. వాడ్ని మళ్ళీ చితకతన్ని జైల్లో వేసుంటారు—అవునా?" నారాయణ అడిగాడు.

"కాదు—వాడి నిజాయితీకి సంతోషించి, మూడువేల రూపాయల నగ తిరిగి యిచ్చినందుకు ప్రతిఫలంగా మీమామయ్య ముప్ఫైమూడు పైసలు బహుమతిగా యిచ్చి వుంటాడు. వాడు అది తాగేసి, రేవులో పడుకుని వుంటాడు. అంతేనా?" అడిగాడు రాధాకృష్ణ—అతనీమధ్య కథలు వ్రాసి సాహిత్య అకాడమీ బహుమతి కొట్టేయాలని చూస్తున్నాడు.

"ఈ కథ ఎలా ముగిసిందీ అని నేను ఆలోచించడంలేదు—అప్పన్న ఆ నగ తిరిగి ఇవ్వకపోయినా అడిగేవాడులేడు. దాదాపు ఆ విషయం మరుగున పడి పోయింది. వాడు దాన్ని యింకేవూళ్లోనో అమ్ముకుని, హాయిగా బ్రతకవచ్చును—కానీ దాన్ని తిరిగి యిచ్చేశాడు. అయినా వాడ్ని అనుమానిస్తున్నాడు మామయ్య. ఈ రెండు అంతస్థులలోని, మామయ్యనూ, అప్పన్ననూ చూస్తుంటే నీతి, నిజాయితీ లలోకూడా, ఈ అంతస్థులు స్పష్టంగా కన్పిస్తాయి. ఆ వ్యత్యాసం నల్లగావున్న నింగినీ,- తెల్లగావున్న నేలనూ చూస్తే మరింత స్పష్టమవుతుంది." అన్నాడు రాజు, మబ్బులుపట్టిన ఆకాశాన్నీ. అలల పాలనురుగులతో ఆటలాడుతున్న తెల్లటి యిసుకనీ చూస్తూ—

